# కవితా కౌముది

## MRI

లక్ష్మీ రాధిక

మబ్బుకమ్మిన జాబిలమ్మకు
అదో మంద్రపు భయం..
ఒంటరిగా చలిపొద్దులోకి జారిన వైనాన
గుండెలో ఒక్కసారిగా మొదలైన నిర్విరామ fusion

లబ్ డబ్..లబ్ డబ్
టు..టు..టు..పి..పి..పి..
ఊ..ఊ..ఊ..రంగ్ రంగ్ రంగ్..
అదో ప్రకృతి భీభత్సపు అలజడి..
A sort of restless chaos

అపస్వరాల పొలిమేరలో
ఆగినట్టున్న భారమైన శ్వాసలోకి
నీ ఆగమనం.. OMG..is that you ?!
హృదయవాదీ..నా మీద అలిగావనుకున్నా..
అరచేతి వెచ్చదనంలో సద్దుమణిగిన ప్రాణం

హఠాత్తుగా ఊపిరికి ఊహలొచ్చి మొదలైన
Lucid Dreams..
కొత్త చిగురులేస్తున్న క్షణాల సాన్నిహిత్యం
క్షేత్రయ్యకే అందని ఓ సుకుమార లాలిత్యం

నా కన్నుల్లోకి చిరునవ్వులొంపుతూ
హత్తుకున్నది నువ్వేనంటే నమ్మలేకున్నా
అరణ్యంలోనూ బీరపువ్వులు పుడతాయని నీకు
తెలుసేమో
కనుకే..
నా ఎదెప్పుడో కోయిలై.. కూజితమైంది

★★★



# గతులు తప్పిన ఋతువులు

## పూసాల సత్యనారాయణ

చెట్టు మెడపై పడుతున్న గొడ్డలి వేటు శబ్దం
నలు దిశల ప్రతి ధ్వనించే అరణ్య రోదనం
నేల కూలుతున్న వనం
కనుమరుగవుతున్న జంతు జాలం
కారు మబ్బులతో కమ్ము తున్న కాలుష్యం
తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే మనుషులు
జీవంతోనే కడుపులోని పేగులు పీక్కొని తినే రాబందువులు.
వసంత ఋతువుపై సామూహిక లైంగిక దాడి
రక్షించే నాధుడేడి ! భక్షించే వాళ్ళు తప్ప
నెమళ్లు ఆగ్రహంతో శివతాండవం చేస్తున్నాయి
చిగురించే పచ్చని ఆకులు లేక చల్లగాలి కరువైనందున
కోకిల గానాలు జీర బోయి
చావు డప్పులై మనిషిని స్మశానం వైపు తీసుకెళ్లుతున్నాయి
దుమ్మెత్తి పోస్తూ ఇంటింటా ధర్నాలు చేస్తున్నాయి
చెట్లే లేవు రాల్చడానికి ఆకులే లేవని
శిశిర ఋతువు ఎక్కి ఎక్కి ఏడ్చి యు టర్న్ తీసుకొంది.
వర్ష ఋతువు బతికి ఉంటే బలుసాకు తినచ్చని
పడుతూ లేస్తూ పరుగు లంఘించింది
గ్రీష్మ ఋతువు సూర్యుడినే భూమండలం పైకి
ఈడ్చు కొచ్చింది కోపంతో ఊగి పోతోంది.
శరదృతువు కార్బన్ డై ఆక్సైడ్ వెదజల్లి
అదే పిండి ఆర బోసిన వెన్నెల అని పరిహాసం చేస్తోంది
మనిషి వన్నె పులిని చూసి హేమంత ఋతువు
జింకలా చెంగు చెంగున గంతు లేసుకుంటు
ప్రాణ రక్షణ కై పరుగులు తీస్తోంది
మనిషి చేస్తున్నది పంచ భూతాలు కాలుష్యం
గతులు తప్పుతున్న ఋతువులు అదృశ్యం

★★★



# నచ్చని రూపమో..మెచ్చని మనసో..
# చందలూరి నారాయణ రావు

ఆరాధన అవమానానికి గురి కాగా
మనోభావాలు విరిగిముక్కలై
ప్రేమ హత్య జరిగింది.

మనసు వైరాగ్యం వైపు అడుగులు వేస్తుంటే
మసకబారిన నిజం ప్రాణమున్న శవంలా
నిజాయితీకి ఊపిరిగా మారింది.

నచ్చని రూపమో?
మెచ్చని మనసో?
"ఒక్క జవాబు" కలిగిన కోటి ప్రశ్నలు
మూగి కసాయికాలం కాళ్ళ కింద మనసు
నలిగిపోతుంది.

ఆశ నేరంగా మారినా
ధ్యాస శాపంగా సాగినా
బంధానికి చిక్కు ముడులు మొలిచినా
పడిన ముద్ర చెరిగిపోదు.
మరిలిన రక్తం వెనక్కి రాదు.

కళ్ల గూటిలో దాచుకున్న పాత చూపులు
పరుపు ఒడిలో ఎగిసిపడుతూ
పక్క కౌగిటిలో ముడుచుకొని
రెప్పలు వాల్చుకొని కొత్త కలలతో
ఒక మనసును మోస్తూ

ప్రతి రాత్రి రోజుకో కలలతీరంలో
ఆగి ఆగి జ్ఞాపకాన్ని సంబరంచేసుకుంటూ మనసు
గడుస్తున్న మనిషిలో
తలపుల్లో తడుస్తుంది.
అందరిలో బతుకు నటిస్తూ...
ఒక్కరిలో చచ్చి జీవిస్తూ...

★★★



# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

తూరుపు దిశయందు వెలుగు దారులిట్లు
గగనమందుండి భూమికి కట్టెనెవరు?
ఏగుదెంచెదరీ త్రోవనెవ్వరిలకు?
చోద్యమరయనో చుట్టంపుచూపు కొరకొ!

అప్సరోజనమార్గమ్ములంచు తోచు
పృథివికరుదెంచు దివ్యుల పథములేమొ!
దివ్యసందేశమెయ్యదో తెత్తురేమొ!
ఇలను పరికించి మరలిపోయెదరో యేమొ!

ఏమి యైనది యీ ధారుణీతలాన?
చిగురు తొడిగెడు మొక్కలు చిన్నబోయె
పచ్చదనమేల యెల్లెడ పలుచనయ్యె
తిరిగిపోయెదరిటనుండి దివ్యులైన

అతిథులేతేరనిల్లు సర్వాంగసుంద
రముగ తీర్చిదిద్దెదము సంభ్రమము గాను
దివ్యులే యతిథులుగనేతెంచగలరు
ధరను తీర్చిదిద్దగను తాత్సారమేల?

సుమతతులతోడ, హరితవర్ణములతోడ
అమిత తరులతో, పచ్చబయళ్ళ తోడ
లలితలలితంబుగ ధరనలంకరించి
పలుకజాలమె స్వాగత వచనములను

COMMENTS